

దళారులను నమ్మి మోసపోవద్దు

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

2



www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

గురువారం | 05 | నవంబర్ | 2026 | పేజీలు: 08



సకల హంగులతో సైన్స్ మ్యూజియం

కోస్గిలో సైన్స్ వెలుగులు

విద్యార్థుల విజ్ఞానానికి వేదిక

రెండు రోజుల్లో మ్యూజియం రెడీ

జిల్లా కలెక్టర్ ప్రియాంక

నారాయణ పేట, అక్షిత బ్యూరో: నారాయణ పేట జిల్లాలోని కోస్గి పట్టణంలో రూ.5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సర్ సీవీ రామన్ సైన్స్ మ్యూజియాన్ని అన్ని హంగులతో త్వరితగతిన పూర్తి చేసి

..మిగతా 2లో

ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలి

సేవ్ వాటర్ సేవ్ పవర్

నీటి బొట్టు వృథాకు చెక్

నీటి భద్రతకు రూ.42 కోట్ల భరోసా

ప్రజలకు నీటి భద్రతను అందించాలి

కలెక్టర్ ప్రతిమా సింగ్





మెదక్, అక్షిత బ్యూరో: ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు ఉండటంతో మెదక్ జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలకు సిద్ధమవుతోంది. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.ఈ నేపథ్యంలో హవేళి ఘన్‌పూర్ మండలం సర్దన గ్రామంలోని చెక్‌డ్యామ్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మిషన్ భగీరథ గ్రిడ్ సిబ్బంది ప్రత్యామ్నాయ నీటి సరఫరాకై ఏర్పాటుచేసిన మ్యాప్ పరిశీలిస్తూ పలు కీలక సూచనలు చేశారు డిసెంబర్ తర్వాత సింగూరు ప్రాజెక్టు

..మిగతా 2లో



భక్తులకు సకల సౌకర్యాలు!

పుష్కరాల నాటికి అన్ని అభివృద్ధి పనులు

సరస్వతీ అమ్మవారి

ఆలయ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులకు కీలక ఆదేశాలు

నిర్మల్, అక్షిత ప్రతినిధి : రానున్న గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలనిజనిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని, పుష్కరాల నాటికి అభివృద్ధి, నిర్మాణ పనులన్నీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.బుధవారం బాసరలోని ఆలయ ఈవో కార్యాలయంలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, సరస్వతీ అమ్మవారి ఆలయ నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకుని, పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు.

భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

పుష్కర ఘాట్ల మరమ్మతులు, నూతన ఘాట్ల నిర్మాణం, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, పిండ ప్రదాన ప్రాంతం, పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం, భక్తుల పార్కింగ్, వీఐపీ పార్కింగ్ తదితర పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పుష్కరాలకు భారీగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, సురక్షితమైన పుష్కర స్నానాలకు అనువైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. పుష్కరాలకు వచ్చే ప్రముఖుల

..మిగతా 2లో

భక్తులకు సకల సౌకర్యాలు!

మొదటి పేజీ తరువాయి...

వసతికి కూడా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రతి పనికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల విషయంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.అనంతరం సరస్వతీ అమ్మవారి ఆలయ నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.పుష్కరాల ఏర్పాట్లు, ఆలయ నిర్మాణ పనులను సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ సుభాష్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలి



మొదటి పేజీ తరువాయి...

నుంచి నీటి సరఫరా నిలిచిపోయే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమస్యను ముందుగానే అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెదక్ జిల్లాకు రూ.42 కోట్ల నిధులు మంజూరు చేసిందని కలెక్టర్ వెల్లడించారు.ఈ సందర్భంగా సర్దన చెక్‌డ్యామ్ వద్ద ప్రత్యేక గ్రిడ్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి సుమారు 3.5 కిలోమీటర్ల మేర జక్కన్నపేట గ్రామం వరకు పైప్‌లైన్ కనెక్షన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా 33 గ్రామాలకు ప్రతిరోజూ ఒక్కొక్కరికి 55 లీటర్ల చొప్పున తాగునీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు.అంతేకాకుండా సర్దన డ్యామ్‌తో పాటు పొడ్చాన్‌పల్లి, కొత్తపల్లి, మిన్‌పూర్ చెక్‌డ్యామ్‌ల వద్ద కూడా గ్రిడ్ వ్యవస్థలు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ నీటి వనరులను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

ఏల్ నీనో ఎఫెక్ట్ ఉన్న నేపథ్యంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ సూచించారు.గ్రామాలలో నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ నల్లాలను డమ్మీ చేయాలని, దీని వల్ల నేటి వృధాను, అరికట్టాలని సూచించారు. సంబంధిత సర్పంచులు గ్రామాలలో గ్రామసభలలో తీర్మానించుకొని సింగిల్, త్రీఫేస్ మోటార్లు నిర్దిష్ట సమయంలోనే ఆన్ చేసి నీటి విడుదల చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మిగతా సమయాలలో మోటార్ ఆఫ్ చేసి పెట్టుకోవాలన్నారు ఇందువల్ల బోర్లలో భూగర్భ జలాలు సమృద్ధిగా పెరుగుతాయన్నారు. అంతేకాకుండా విద్యుత్ పొదుపుఅవుతుందన్నారు. గ్రామాలలో ఉన్న త్రీఫేస్ మోటార్ నుండి నీటిని ట్యాంక్ కి వినియోగించుకోవాలని త్రీఫేస్, సింగల్ ఫేస్ కరెంటు మరమ్మత్తులు గ్రామాలలో బోర్లు ఫ్లషింగ్ , డిపెన్ నింగ్ , హై రింగ్ సంబంధిత విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి లభ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా పరిస్థితులను నిరంతరం అంచనా వేస్తూ, దీర్ఘకాలిక సమస్యలు ఉన్న ఆవాసాల్లో సరఫరా అంతరాయాలను ముందుగానే గుర్తించాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రాబోయే రోజుల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు మెదక్ జిల్లాలో చేపడుతున్న చర్యలు కేవలం తాత్కాలిక నీటి కొరతను అధిగమించేందుకు మాత్రమే కాకుండా భవిష్యత్తు తరాలకు నీటి వనరులను అందుబాటులో ఉంచేందుకు ఉపయోగపడనున్నాయి. అని వివరించారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగభూషణం, తాసిల్దార్ సింధు రేణుక , గ్రామ సర్పంచ్ వినోద,ఎలక్ట్రిసిటీ డి .ఈ రామేశ్వర స్వామి, మిషన్ భగీరథ ఈ.ఈ సంపత్ కుమార్,ఇంట్రా డి ఈ నరేష్ గ్రామస్తులతో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సకల హంగులతో సైన్స్ మ్యూజియం

మొదటి పేజీ తరువాయి...



ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోస్గి పట్టణంలోని సర్ సీ.వీ.రామన్ సైన్స్ మ్యూజియాన్ని సందర్శించి,అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మ్యూజియంలో విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రంపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న వివిధ రకాల సైన్స్ పరికరాలను,వాటి అమరిక పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మ్యూజియంలో సైన్స్ పరికరాల ఏర్పాటు,ఇతర మిగిలిన పనులన్నింటినీ మరో రెండు రోజుల్లో పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు.మ్యూజియంలో ఏర్పాటు చేస్తున్న సైన్స్ పరికరాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులకు సూచించారు. పరికరాలను ఎలాంటి రక్షణ లేకుండా బహిరంగంగా ఏర్పాటు చేయకుండా, వాటి పరిరక్షణ కోసం తగిన విధంగా చిన్న గాజు పలకలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు పరికరాలను సులభంగా పరిశీలించేలా, వాటికి ఎలాంటి నష్టం కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

అదేవిధంగా ప్రతి సైన్స్ పరికరం వెనుక భాగంలో దాని పేరు, ఉపయోగం, పనితీరు, శాస్త్రీయ సూత్రాలను వివరించేలా పెద్ద సైజు సమాచార చార్టులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. దీనివల్ల విద్యార్థులు సంబంధిత పరికరాన్ని పరిశీలిస్తూనే దాని పనితీరును చదివి అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సైన్స్ పరికరాలకు సంబంధించిన సమాచారం సరళమైన భాషలో, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉండాలని పేర్కొన్నారు.

అలాగే మ్యూజియం ఆవరణలో పరిశుభ్రతను పాటిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా గ్రీనరీని ఏర్పాటు చేయాలని, మొక్కలు నాటి పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు మ్యూజియాన్ని సందర్శించినప్పుడు ఆహ్లాదకరమైన అనుభూతి కలిగేలా పరిసరాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మ్యూజియం ప్రారంభమైన అనంతరం పరికరాల పనితీరును విద్యార్థులకు వివరించేందుకు ప్రత్యేకంగా ఒక సైన్స్ అధికారిని నియమించాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు. మ్యూజియాన్ని సందర్శించే విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు, పరికరాల వినియోగం, శాస్త్రీయ అంశాలపై అవగాహన కల్పించే విధంగా అవసరమైన సిబ్బంది, నిర్వహణ ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

మ్యూజియంలో అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేసి, నిర్దేశించిన గడువులోగా మ్యూజియాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, కోస్గి మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్, ప్రజారోగ్య శాఖ ఎస్.ఈ. విజయ్ భాస్కర్, హైదరాబాద్ బిర్లా ప్లానిటోరియం డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, కోస్గి మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ కళ్యాణి, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల ఏఈలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



గంగాధర, అక్షిత న్యూస్ : ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. గంగాధర మండలం హిమ్మత్ నగర్, కురిక్యాల, గంగాధర, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గన్ని సంచులు, పరదాలు, తూకం యంత్రాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతుల వివరాలను నమోదు చేసుకొని, తేమ శాతం వచ్చిన వెంటనే వడ్లు కొనుగోలు చేయాలని, రైతు వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి రైతుల ఖాతాలో ధాన్యం దబ్బులు జమ అయ్యేలా చూడాలని సూచించారు. కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరెడ్డి, జిల్లా సహకార అధికారి రామాంజనేయ చార్య, సింగిల్ విండో చైర్మన్లు వెలిచాల తిరుమల్ రావు, దూలం బాల గౌడ్, తహశీల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో రాము, ఏపిఎం కుమారస్వామి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్,మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ,మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్, సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షుడు ముద్దం నగేష్,సర్పంచ్ లు పడాల భాగ్యలక్ష్మి రాజన్న,రామిడి రాజిరెడ్డి,బాసవేని శ్రీనివాస్,రేండ్ల శ్రీనివాస్,బీర్ల ఆనంద్,ఆరె తేజశ్రీ – రాజశేఖర్,మల్కాపురం రాజేశ్వరి రాజేశం,కడారి రేణుక కనకయ్య,చిందం ఆంజనేయులు,కోలేపాక కవిత మల్లేశం,ధీకొండ బాబలక్ష్మి మధు,గుండవేని లావణ్య తిరుపతి,గుడి రజని ప్రవీణ్ రెడ్డి,రాచమల్ల రవి,కాంగ్రెస్ నాయకులు రొమాల రమేష్, సాగి అజయ్ రావు,రాచమల్ల భాస్కర్,గుజ్జుల బాపు రెడ్డి,అత్తపురం తిరుపతి, గంగాధర ప్రవీణ్,కడారి కుమారస్వామి,అట్ల రాజి రెడ్డి,అట్ల శేఖర్ రెడ్డి,పిట్టల కమలాకర్,వేముల అంజి, పొత్తూరి ప్రభాకర్, తాళ్ల సురేష్,జారతి సత్తన్న, ఆకుల అంజన్న, పవుల్, బెజ్జంకి కళ్యాణ్ , తాళ్ల దిలీప్ కార్యకర్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలి

జీవ వనరుల కేంద్రాల ద్వారా జీవ ఎరువులు, కీటక నివారణ ద్రావణాలు అందించాలి:

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, నవంబర్ 4: జీవ వనరుల కేంద్రాల ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ప్రకృతి సిద్ధమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ, రైతులకు అవసరమైన జీవ ఎరువులు, కీటక నివారణ ద్రావణాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. లింగాల ఘనపురం మండలం లిలిసిరిపురం గ్రామంలో ఏర్పాటు చేసిన జీవ వనరుల కేంద్రం (బయో రిసోర్స్ సెంటర్--బీఆర్సీ)లిలిను బుధవారం కలెక్టర్ సందర్శించారు. కేంద్రం నిర్వహణ, జీవ ఆధారిత ఎరువులు, కీటక నివారణ ద్రావణాల తయారీ, రైతులకు అందిస్తున్న సేవలను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన వివిధ రకాల జీవ ఆధారిత ఎరువులు, కీటక నివారణ ద్రావణాల తయారీ విధానం, వాటి వినియోగం, రైతులకు అందిస్తున్న సేవలపై సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంలో కీలకమైన జీవామృతం, అగ్నాస్త్రం వంటి సహజ ఉత్పత్తుల తయారీ, వినియోగం, పంటల సాగులో వాటి ప్రాధాన్యతను రైతులకు వివరించాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటివరకు సుమారు 60 నుంచి 70 మంది రైతులకు జీవామృతం, అగ్నాస్త్రం వంటి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి సిద్ధమైన పద్ధతుల ద్వారా పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించడంలో జీవ వనరుల కేంద్రాలు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జీవ ఎరువులు, కీటక నివారణ ద్రావణాల తయారీ విధానం, వినియోగంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులను మరింత విస్తరించి, రైతులు వాటిని సద్వినియోగం చేసుకునేలా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ, ఏడీఏ వసంత సుగుణ, డీపీఎంలు జ్యోతి, నళిని, మారి సంస్థ ప్రతినిధులు మారపాక వెంకట్ స్వామి, చాగంటి నరేష్, గాండ్ల రాజు, వంశీ, రాజేందర్, రీఛా, కృషి సఖీలు, రైతులు, ఇతర

వార్డు అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తా

14వ వార్డులో నీటి బోరు ఏర్పాటు....

14వ వార్డు కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్



చౌటుప్పల్/ అక్షిత న్యూస్ : మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి, చౌటుప్పల్ పురపాలక సంఘం చైర్మన్ మొగదాల పావని రమేష్ గౌడ్ ల సహకారంతో వార్డు అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తానని వార్డు కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్ తెలిపారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్ ల ఆదేశాలతో 14వ వార్డు కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్, కో ఆప్షన్ నెంబర్ సందగల్ల విజయ సతీష్ ల పర్యవేక్షణలో దివిస్ పరిశ్రమ సహకారంతో 14వ వార్డులో ప్రజల అవసరాల రీత్య బోరు వేయించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ..14వ వార్డు ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్న శాసనసభ్యులుకి, మున్సిపల్ చైర్మన్ కి, బోరు వేయించిన దివిస్ యాజమాన్యం కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్న వార్డు ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. 14వ వార్డులోని ప్రజలు అందరూ కలిసికట్టుగా ఉండి వార్డును అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వర్కాల రవిగౌడ్, కామిశెట్టి చంద్రశేఖర్,ఓరగంటి భాను,మందలోజు శ్రీధర్ చారి, ఓరుగంటి భాను గౌడ్, ఎస్.కె మున్నా, రాజపేట యాదగిరి చారి,ఉడుగు కృష్ణ,ఎస్.కె జహీర్, మలిగే శ్రీను, ఉడుగు నరసింహ, వర్కాల శివ,ఉడుగు నవీన్, ఉడుగు సాయికుమార్, మందలోజు మనోజ్ చారి, వర్కాల లలిత, వర్కల భాను, వర్కాల వెన్నెల, పద్మ,వరకాల మంజుల,వర్కల పద్మ, రాజపేట రమాదేవి,ఓరగంటి ఇందిర, చిలువేరు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం డివైఎఫ్ఐ కృషి చేస్తుంది



చౌటుప్పల్/ అక్షిత న్యూస్: భారత ప్రజాతంత్ర యువజన సమైక్యా 47వ వార్షికోత్సవం పురస్కరించుకొని, డివైఎఫ్ఐ పంతంగి గ్రామ శాఖ జెండాను బుధవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా డివైఎఫ్ఐ చౌటుప్పల్ మండలం అధ్యక్షులు రత్నం శ్రీకాంత్ మాట్లాడుతూ... నిరుద్యోగ పరిష్కారం కోసం ప్రభుత్వం రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీలు చేయాలన్నారు.స్థానిక పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగ కల్పన చేయాలని డిమాండ్ చేశారు.

యువత గంజాయి డ్రగ్స్ మాదకద్రవ్యాలను వీడి సామాజిక బాధ్యత కలిగిన పౌరులుగా ఉండాలన్నారు.కులమతాలకు అతీతంగా, ఐక్యత, సమానత్వం, సామాజిక న్యాయం కోసం డివైఎఫ్ఐ కృషి చేస్తుందన్నారు.

డివైఎఫ్ఐ 47 సంవత్సరాల ఉద్యమ స్ఫూర్తితో యువత అధిక సంఖ్యలో డిఐఎఫ్ఐ లో చేరి యువజన సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ నాయకులు నేరేడు మహేష్, రోడ్డు శివకుమార్, నక్క లింగస్వామి , పిఎసిఎస్ మాజీ చైర్మన్ చీర్క సంజీవరెడ్డి, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు రత్నం శ్రీకాంత్, సిద్దగోని శ్రీకాంత్, నక్క నాగరాజు, రోడ్డ శ్రీకాంత్, బర్రె శశిధర్, సుక్క శ్రీకాంత్, బోయ సాయి కిరణ్, జంగం నాగేష్, రొడ్డ దీక్షిత్ లు పల్గొనారు.

టీచర్స్ సెల్ కన్వీనర్‌గా చిందం ప్రకాష్



వరంగల్, అక్షిత బ్యూరో: వరంగల్ జిల్లా భారతీయ జనతా పార్టీ టీచర్స్ సెల్ కన్వీనర్‌గా చిందం ప్రకాష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్ జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, వరంగల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, దార బాలరాజు, చేద్దిరెడ్డి నవీన్ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకుల సహకారంతో చిందం ప్రకాష్‌కు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యారంగ అభివృద్ధికి, హక్కుల పరిరక్షణకు కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి తన వంతు సహకారం అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిందం ప్రకాష్‌కు పలువురు ఉపాధ్యాయులు, నాయకులు అభినందనలు తెలియజేశారు.

అజిలాపూర్ గ్రామంలో అసంపూర్తి గృహ నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సహాయం



నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: కల్వకుర్తి నియోజకవర్గం, వెల్దండ మండలం, అజిలాపూర్ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవసరమైన 5000 ఇటుక అందజేశారు.రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీ ఉప్పల వెంకటేష్ గారి సహకారంతో కేషమోని కౌసల్య (భర్త: లక్ష్మయ్య) ఇంటి నిర్మాణానికి సరిపడా ఇటుక అందజేయబడింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. పేద మరియు అవసరమైన కుటుంబాలకు అండగా నిలుస్తూ, గృహ నిర్మాణం పూర్తయ్యేలా సహకరించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధగొని రమేష్ గౌడ్, 4వ వార్డు సభ్యుడు గోరంట్ల రమేష్,బీఆర్ఎస్ నాయకులు కొప్పుల రవి కుమార్ , వరికుప్పల ప్రశాంత్, సాల్వది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వ పనులకు ప్రజలు అధిక ప్రాధాన్యతనివ్వాలి

సర్పంచ్ దున్నా శ్రీనివాస్



నడిగూడెం, అక్షిత న్యూస్: ప్రభుత్వం చేపడుతున్న నీటి నిల్వ పనులకు అధిక ప్రాధాన్యతనిస్తూ రైతులు, ప్రజలు సహకరించాలని గ్రామ సర్పంచి దున్నా శ్రీనివాస్ కోరారు.బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో జల సంరక్షణ కుంట పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ప్రభుత్వం చేపడుతున్న నీటి నిల్వ పనులు జల సంరక్షణ కుంటలు,పంట కుంటలు,నీటి కుంటలు,బోర్ వెల్ రీఛార్జి, ఇంకుడు గుంతలు నిర్మించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి,టెక్నికల్ అసిస్టెంట్ అంజిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, ఉపాధి కూలీలు జలీల్, వెంకన్న,శ్రీలేఖ, లింగయ్య,లక్ష్మి సుజాత,కళ్యాణి,మాధవి, రజిని,విజయమ్మ పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లాలో ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్,అక్షిత బ్యూరో: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణ లో గల ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను కుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు.ఈ కార్యక్రమములో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హాలీ, తహసిల్దార్,సిబ్బంది తదితరులు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి గోలి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక చేయూత



కల్వకుర్తి అక్షిత ప్రతి నిధి: కల్వకుర్తి నియోజకవర్గం కల్వకుర్తి మండలం లింగసానిపల్లి గ్రామానికి చెందిన జహంగీర్ బీ అనారోగ్యంతో మృతి చెందారు. లింగసానిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పర్షరములు ద్వారా విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులకు 5000/-వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్షరములు,కంటెస్టెడ్ సర్పంచ్ భీమయ్య వార్డ్ మెంబర్ వెంకటేష్. బిఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ అధ్యక్షుడు అజయ్.మరియు నాయకులు లింగారెడ్డి, శ్రీను, రామస్వామి,శంకర్,మరియు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శేఖర్‌ను పరామర్శించిన జర్నలిస్ట్ నాయకులు



కల్వకుర్తి అక్షిత ప్రతి నిధి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న , డాన్స్ మాస్టర్ ఎదుల శేఖర్‌ను బుధవారం సీనియర్ జర్నలిస్టులు వెంకటయ్య,దుబ్బా నాగేష్,కస్తూరి శ్రీనివాస్,రామ్ చందర్ బాలయ్య, కార్తీక్, రాజన్న,శేఖర్ ఎర్రవెల్లి శ్రీను, జర్నలిస్టు లు పరామర్శించారు.ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ఆర్థిక సహాయం అందించారు.శేఖర్ త్వరగా కోలుకుని తిరిగి సాధారణ జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు

జనసమూహాల్లో అనుమానితుల గుర్తింపునకు హైటెక్ నిఘా!

ముఖ గుర్తింపు సాంకేతికతతో అనుమానితుల గుర్తింపు

వేలిముద్రల విశ్లేషణతో నేర పరిశోధనకు మరింత బలం

పోలీస్ సిబ్బందికి దిశానిర్దేశం చేసిన నిర్మల్ ఎస్పీ డా. జి. జానకి షర్మిల...

నిర్మల్ పోలీస్... మీ పోలీస్...





నిర్మల్,అక్షిత ప్రతినిధి,నవంబర్ 4 : నేరాల నియంత్రణ,ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించుకుంటోంది. జనసమూహాల్లో అనుమానితుల గుర్తింపునకు ముఖ గుర్తింపు వ్యవస్థ కొత్త విధానాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల,పోలీస్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

ముఖ గుర్తింపు వ్యవస్థ కొత్త విధానం వినియోగంపై పోలీస్ సిబ్బందితో ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేర నియంత్రణను మరింత పటిష్టం చేయడం, అనుమానితులను వేగంగా గుర్తించడం, ప్రజలకు మెరుగైన భద్రత కల్పించడం వంటి అంశాలపై వివరించారు.

ముఖ గుర్తింపు సాంకేతికతతో అనుమానితుల గుర్తింపు

జనసమూహాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అనుమానితులను ముఖాల ఆధారంగా గుర్తించేందుకు ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని ఎస్పీ వివరించారు.

ముఖ గుర్తింపు సాంకేతికత ద్వారా అనుమానితులను వేగంగా గుర్తించి, అవసరమైన చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా పోలీస్ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేయగలదని పేర్కొన్నారు.

వేలిముద్రలతో నేర పరిశోధనకు మరింత బలం

జాతీయ స్వయంచాలిత వేలిముద్రల గుర్తింపు వ్యవస్థ ద్వారా వేలిముద్రల ఆధారంగా వ్యక్తులను గుర్తించే విధానంపై కూడా ఎస్పీ సిబ్బందికి అవగాహన కల్పించారు.

నేర పరిశోధనలో వేలిముద్రల సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ఆధునిక గుర్తింపు వ్యవస్థలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

ప్రజల భద్రతే ప్రాధాన్యం.. నేర నియంత్రణే లక్ష్యం

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ నేరాల నియంత్రణకు నిరంతరం కృషి చేయాలని ఎస్పీ పోలీస్ సిబ్బందికి సూచించారు. ప్రజల భద్రతకు మరింత పటిష్టమైన చర్యలు చేపడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వేలిముద్రల విభాగం నిర్మల్ సిబ్బంది, జిల్లా నేర రికార్డుల విభాగం సిబ్బంది, సమాచార సాంకేతిక విభాగం సిబ్బంది పాల్గొన్నారు...

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం.. ఫిర్యాదులపై తక్షణ స్పందన!

భైంసా గ్రీవెన్స్ డేలో బాధితుల సమస్యలను స్వయంగా ఆలకించిన ఎస్పీ డా. జి. జానకి షర్మిల

పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు.. అధికారులకు ఎస్పీ ఆదేశాలు



నిర్మల్, అక్షిత ప్రతినిధి నవంబర్ 4 : ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్, స్పష్టం చేశారు. ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

కుటుంబ సమస్యలపై షీ టీం కౌన్సెలింగ్

కుటుంబ సమస్యలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై షీ టీం సిబ్బంది ప్రత్యేకంగా స్పందించారు. ఇరు వర్గాలతో మాట్లాడి కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు, పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. భైంసాలోనే కౌన్సెలింగ్ సదుపాయం అందుబాటులో ఉండటంతో బాధితులు సంతృప్తి వ్యక్తం చేశారు.

పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక సమీక్ష

గతంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితిపై ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను గుర్తించి, వాటి పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయవద్దని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు సకాలంలో న్యాయం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు గ్రీవెన్స్ డే ఒక మంచి వేదికగా నిలుస్తోందని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యంగా పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందని తెలిపారు...

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం: ఎమ్మెల్యే నాయిని ...

47, 62వ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కాజీపేట్, అక్షిత ప్రతినిధి : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కాజీపేట ప్రాంత అభివృద్ధికి ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం కాజీపేటలోని 47, 62వ డివిజన్ల పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీల్లో రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.

అనంతరం మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, ఎస్సీ కాలనీలు, మురికివాడలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కేవలం జీవోలు తీసుకురావడం, కొబ్బరికాయలు కొట్టి శిలాఫలకాలు ఏర్పాటు చేయడమే అభివృద్ధి కాదని, ప్రారంభించిన పనులను పూర్తి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తమ పరిధిలో చేపట్టిన పనుల్లో సుమారు 98 శాతం పూర్తి చేశామని, మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేస్తున్నామని వెల్లడించారు.

ప్రభుత్వ భూముల విషయంలో విచారణ కోరాం:

వైఎస్సార్ నగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని భూములపై కూడా పూర్తి స్థాయి విచారణ జరిపించాలని కలెక్టర్‌కు లేఖలు ఇచ్చినట్లు తెలిపారు. కాజీపేట చౌరస్తాలో కాంప్లెక్స్‌కు సంబంధించి 2020లో అప్పటి పాలకులు అనుమతుల మంజూరులో నిబంధనలు ఉల్లంఘించారా లేదా అనే విషయంపై విచారణ జరిపించాలని కోరినట్లు చెప్పారు. 2026లో జారీ అయిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌తో పాటు భవన వినియోగ అనుమతుల విషయంలోనూ స్పష్టత ఇవ్వాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు మరోసారి లేఖ రాసినట్లు వెల్లడించారు.

ఈ ఏడాది సైతం టెన్త్ విద్యార్థులందరికీ పరీక్ష ఫీజు చెల్లిస్తా

కేంద్ర మంత్రి బండి సంజయ్ హామీ



కరీంనగర్ అక్షిత బ్యూరో: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థులందరికీ ఈ ఏడాది సైతం ఎగ్జామ్ ఫీజు చెల్లించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్ణయించారు. తెలంగాణ ప్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం(తపస్) కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అన్నపునేని తిరుపతిరావు, జారతి నర్సయ్య 5 రోజుల క్రితం కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తూ వాటిని బలోపేతం చేయడం కోసం బండి సంజయ్ తీసుకుంటున్న చర్యలు అమోఘమని వారు కొనియాడారు. అందులో భాగంగా సీఎస్సార్ నిధులతోపాటు ఇతర సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, టాయిలెట్ల నిర్మాణం చేపట్టడమే కాకుండా టెన్త్ విద్యార్థులందరికీ ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లను పంపిణీ చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. గతేడాది టెన్త్ చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ పరీక్ష ఫీజు చెల్లించి ఆదుకున్న విషయాన్ని సైతం ప్రస్తావించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులంతా అత్యంత పేదవారు కావడం, పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ ఏడాది సైతం అనేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని బండి సంజయ్ దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సర్కారీ స్కూళ్లలో టెన్త్ చదువుకునే విద్యార్థులందరి ఫీజును తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత జిల్లాల డీఈఓలకు సమాచారం అందించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 10 వేల 959 మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లలో పదో తరగతి చదువుకుంటున్నారు. వీరిలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 3,920, కరీంనగర్ జిల్లాలో 4,356, జగిత్యాల జిల్లాలో 1087, సిద్దిపేట జిల్లాలో 1133, హన్మకొండ 463 మంది విద్యార్థులు ఉన్నారు. బండి సంజయ్ తీసుకున్న నిర్ణయంతో వీరందరికీ ఎంతో మేలు జరగనుంది. ఆయా విద్యార్థుల ఎగ్జామ్ ఫీజు మొత్తం ఎంత అవుతుంది ? అనే వివరాలను సంబంధిత జిల్లాల డీఈఓలనుండి సేకరించి రెండు, మూడు రోజుల్లో ఆ మెత్తాన్ని చెక్ రూపంలో చెల్లించాలని కేంద్ర మంత్రి నిర్ణయించడం గమనార్హం.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు సేంద్రీయ ధ్రువీకరణ తప్పనిసరి

సర్టిఫికేషన్‌తో పాటు మార్కెట్, సరఫరా వ్యవస్థపై దృష్టి పెట్టాలి:

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ అక్షిత బ్యూరో :నవంబర్ 4 : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో గుర్తింపు, రైతులకు మెరుగైన ధరలు లభించాలంటే సేంద్రీయ వ్యవసాయ ధ్రువీకరణ పత్రం పొందేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. ప్రకృతి వ్యవసాయాన్ని సంప్రదాయ సాగు విధానానికే పరిమితం చేయకుండా వాణిజ్య స్థాయిలో విస్తరించి రైతుల ఆదాయాన్ని పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

లింగాల ఘనపురం మండలం సిరిపురం గ్రామంలో రైతు బసవగాని మహేష్ వ్యవసాయ క్షేత్రంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం కింద కృషి సఖీలు, గ్రామీణ వనరుల ప్రతినిధులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి బుధవారం కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పంట పొలంలో మొక్కను నాటి, ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయంలో జిల్లాలో ఇప్పటివరకు సాధించిన పురోగతి, రైతులకు అందుతున్న సేవలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ధ్రువీకరణ ఉంటేనే వాణిజ్య అవకాశాలు

ప్రస్తుతం రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తున్నప్పటికీ, వాటిని పెద్ద ఎత్తున వాణిజ్య స్థాయికి తీసుకెళ్లాలంటే సేంద్రీయ లేదా ప్రకృతి వ్యవసాయ ధ్రువీకరణ పత్రం పొందడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. కూరగాయలు, ప్రత్యేక పంటలు సాగు చేస్తున్న రైతులు తమ ఉత్పత్తులకు ధ్రువీకరణ పొందితే మార్కెట్‌లో అధిక ధరలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు.

రైతులు వినియోగిస్తున్న విత్తనాలు, సాగు సామగ్రి, సాగు విధానాలు, పంటల నిర్వహణ తదితర వివరాలను క్రమబద్ధంగా నమోదు చేసుకుంటూ నిర్దేశిత ప్రమాణాలను పాటించాలని సూచించారు.

మార్కెట్‌తో అనుసంధానం అవసరం

ధ్రువీకరణ పొందడంతోనే ప్రక్రియ పూర్తికాదని, ఉత్పత్తులకు ముందుగానే మార్కెట్‌ను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతుల నుంచి ఉత్పత్తుల సేకరణ, శుద్ధి, ప్యాకేజింగ్, నిల్వ, విక్రయం, రవాణా వంటి అన్ని దశలను అనుసంధానం చేస్తూ సమగ్ర సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

అంతర్జాతీయ మార్కెట్లకు ఉత్పత్తులను ఎగుమతి చేయాలంటే నాణ్యతా ప్రమాణాలు, ఆహార భద్రతా నిబంధనలు, అవసరమైన ధ్రువీకరణలు, ఆహార భద్రతా నిర్వహణ ప్రమాణాలు, ఎగుమతి అనుమతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు.

సిక్కిం, ఉత్తరాఖండ్ ఆదర్శం

ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయంలో సిక్కిం, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. సిక్కిం పూర్తిస్థాయి సేంద్రీయ రాష్ట్రంగా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. నాణ్యత, ధ్రువీకరణ, మార్కెట్ అనుసంధానం ఉంటే స్థానిక రైతుల ఉత్పత్తులను కూడా అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లే అవకాశం ఉందని తెలిపారు.

రైతు సంఘాలుగా ఏర్పడి మార్కెట్ సృష్టించుకోవాలి

రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి సమష్టిగా ఉత్పత్తుల సేకరణ, విక్రయం, ప్రాసెసింగ్, ఎగుమతులపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. ఏ పంటను ఎలా సాగు చేయాలి, నాణ్యతను ఎలా పెంచాలి, కోత అనంతర నిర్వహణ ఎలా చేపట్టాలి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను ఎలా సిద్ధం చేయాలనే అంశాలపై రైతులు పూర్తి అవగాహన పొందాలన్నారు. గుజరాత్‌లో అమూల్ విజయవంతమైన సహకార వ్యవస్థను ఉదాహరణగా పేర్కొంటూ.. రైతులు సంఘటితంగా పనిచేస్తే వ్యవసాయ ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్‌ను సృష్టించుకోవచ్చన్నారు. పుట్టగొడుగుల సాగు వంటి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై కూడా రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ, సహాయ వ్యవసాయ సంచాలకులు వసంత సుగుణ, జిల్లా ప్రాజెక్టు నిర్వాహకులు జ్యోతి, నళిని, ఉద్యానవన శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, మారి సంస్థ ప్రతినిధులు మారపాక వెంకట్ స్వామి, చాగంటి నరేష్, గాండ్ల రాజు, వంశీ, రాజేందర్, రీచా, కృషి సఖీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకి గౌరవ వేతనం నెలకి 18000 రూపాయలు ఇవ్వాలి

బెల్లంకొండ సత్యనారాయణ

రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి



నడిగూడెం, అక్షిత న్యూస్: ఫీల్డ్ అసిస్టెంట్ లకి గౌరవ వేతనం నెలకి 18000 రూపాయలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 15వ తారీకు నుండి 18 తారీకు వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే అఖిలభారత కిసాన్ మహాసభలను జయప్రదం చేయాలని ప్రచారంలో భాగంగా నడిగూడెం మండల కేంద్రంలో ఫీల్డ్ అసిస్టెంట్లును కలిసి వారి సమస్యలను తెలుసుకున్న రైతు సంఘం, ప్రజాసంఘాల బృందం ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన 47,79 జీవోని రద్దుపరిచి ఫీల్డ్ అసిస్టెంట్ లకి న్యాయం చేయాలని, గత 20 సంవత్సరాల నుండి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా సేవలందిస్తున్నారని వారిని ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రచారంలో గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, రైతు సంఘం సీనియర్ నాయకులు వీరాంజనేయులు, ఎస్కే లతీఫ్ బాబు, సుధాకర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ల మండల అధ్యక్షులు పద్మ ,కొరట్ల వెంకటేశ్వర్లు, అంబేద్కర్, సీతారాం రెడ్డి ,ఎస్.కె మాసంబి తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో ప్రభుత్వ బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి..

నాగర్‌కర్నూల్ ,ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు.జిల్లాలోని బీసీ విద్యార్థులకు టీజీపీఎస్సీ గ్రూప్స్, పోలీస్, డీఎస్సీ, టెట్, ఎస్ఎస్సీ, ఆర్ఆర్బీ, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షలకు ఉచితంగా నాణ్యమైన శిక్షణ అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కోచింగ్ కేంద్రం లేకపోవడంతో పేద విద్యార్థులు హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.స్టడీ సర్కిల్ ఏర్పాటుకు జిల్లా కార్యాలయాల సముదాయంలో 4,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ప్రభుత్వ భవనాన్ని గుర్తించినట్లు తెలిపారు. అందులో రెండు స్టడీ హాళ్లు, నాలుగు గదులతో పాటు మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, ఇంటర్నెట్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. శాశ్వత భవనం నిర్మించే వరకు ఈ భవనంలో తాత్కాలికంగా తరగతులు ప్రారంభించాలని సూచించారు.స్టడీ సర్కిల్ ఏర్పాటుకు తక్షణ అనుమతులు మంజూరు చేయడంతో పాటు అవసరమైన నిధులు, బోధనా సిబ్బందిని కేటాయించాలని మంత్రిని కోరారు. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్యతరగతి బీసీ విద్యార్థులకు పోటీ పరీక్షల శిక్షణ స్థానికంగానే అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎస్సై



అక్షిత బ్యూరో, అదిలాబాద్: బజార్ హత్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రమాద కేసు నుంచి తప్పించేందుకు బాధితుడి నుంచి రూ.40 వేలు లంచం తీసుకుంటూ బజార్‌హత్నూర్ ఎస్సై రమేశ్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం మోర్ఖండి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి యాక్సిడెంట్ కేసులో ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఎస్సై రూ.40 వేలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ మధు ఆధ్వర్యంలో అధికారులు బుధవారం మధ్యాహ్నం ట్రాప్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిసరాల్లో బాధితుడి నుంచి ఎస్సై డబ్బులు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని ఎస్సైని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. పోలీసు శాఖలో లంచం వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి: పోలీస్ అధికారులకు ఎస్పీ సూచన

మహాదేవపూర్ పోలీస్ స్టేషన్ తనకి అధికారులకు సూచన



మంథని/ మహాదేవపూర్, అక్షిత ప్రతినిధి: శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వివరిస్తూ నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు జిల్లా పోలీస్ అధికారి సిరి శెట్టి సంకీర్త్, బుధవారం రోజు మహాదేవపూర్ పోలీస్ స్టేషన్ ను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ లోని రికార్డులను పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి పరిశీలించడం జరిగింది. అలాగే సిసి కెమెరాల పనితీరు నెరుగా పరిశీలించారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత ను కూడా పరిశీలించారు. అనంతరం ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్, డి.ఎస్.పి కాటారం మహాదేవపూర్, సర్కిల్ ఇన్స్పెక్టర్, వెంకటేశ్వరరావు,సబ్ ఇన్స్పెక్టర్ సాంబమూర్తి మండల పరిధి తో పాటు సర్కిల్ పరిధిలో ప్రస్తుత పరిస్థితులను అడిగి అడిగి తెలుసుకున్నారు,

అనంతరం పెండింగ్ కేసులు వేగవంతం చేసి కేసులను తర్వాతి గతిన పరిష్కరించాలని సూచించడం జరిగింది. అలాగే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదు పై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఎస్పీ ఆదేశించారు. నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులతో పాటు సిబ్బందిని సూచించారు.

కేంద్రంలో మోడీ ప్రభుత్వం
రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలి

ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

నవంబర్ 15న రెండు లక్షల మంది రైతులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



సూర్యాపేట , అక్షిత బ్యూరో : పోరాటాల పురిటిగడ్డ నల్గొండలో ఈనెల 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్)36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు.ఈ మహాసభల సందర్భంగా 15న నల్గొండలోని ఎన్జీ కాలేజీ గ్రౌండ్స్‌లో రెండు లక్షల మంది రైతులతో భారీ ప్రదర్శన నిర్వహించిన అనంతరం భారీ బహిరంగ సభ జరుపనున్నట్లు తెలిపారు.కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని, తెలంగాణ రాష్ట్రాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించి రూ.50 వేల కోట్ల కరువు సహాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇట్టి మహాసభల విజయవంతం కోసం బుధవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 36 ట్రాక్టర్లతో భారీ ప్రదర్శన నిర్వహించారు.కొత్త బస్టాండ్ సమీపంలోని బాలాజీ రైస్ మిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కొత్త బస్టాండ్ నుండి పీఎస్ఆర్ సెంటర్ మీదుగా ఎన్టీఆర్ పార్క్ వరకు సుమారు 40 ట్రాక్టర్లతో నిర్వహించిన ఈ ప్రదర్శన పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 1.58 కోట్లకు పైగా సభ్యత్వంతో అఖిల భారత కిసాన్ సభ ప్రపంచంలోనే అతిపెద్ద రైతాంగ ఉద్యమ సంస్థగా కొనసాగుతోందన్నారు.

సామ్రాజ్యవాదం,భూస్వామ్యానికి వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తూ రైతాంగ హక్కుల కోసం నిరంతరం పోరాడుతోందని తెలిపారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం,తెభాగా,వర్లీ ఆదివాసీ,పున్నప్ర-వయలార్, సుర్మా లోయ రైతాంగ పోరాటాల స్ఫూర్తితో నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను నిర్మిస్తోందన్నారు.ఆ చారిత్రాత్మక పోరాటాల స్ఫూర్తితో దేశ వ్యాప్తంగా రైతులను సంఘటితం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత కిసాన్ సభ నిరంతరం కృషి చేస్తోందని వివరించారు.దేశానికి అన్నం పెట్టే రైతాంగం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే శ్రమజీవులు నేడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా అమలవుతున్న ఆర్థిక విధానాలు,అసమాన మార్కెట్ వ్యవస్థ,బలహీనమైన సామాజిక భద్రత,ప్రకృతి వైపరీత్యాలు వ్యవసాయ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయని విమర్శించారు. 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని, వ్యవసాయ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమైందని పేర్కొన్నారు. నల్లగొండలో జరగబోయే ఈ జాతీయ మహాసభలకు దేశ నలుమూలల నుండి సుమారు 950 మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు, నాయకులు హాజరు కానున్నట్లు స్పష్టం చేశారు.తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి,సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు,తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు దండ వెంకటరెడ్డి,కొప్పుల రజిత, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, దేవరం వెంకటరెడ్డి,షేక్ సైదా, మేకనబోయిన శేఖర్,జిల్లా ప్రజా సంఘాల నాయకులు వేల్పుల వెంకన్న, జె.నరసింహారావు, వీరబోయిన రవి,వల్లపుదాసు సాయికుమార్,మామిడి సుందరయ్య,నారాయణ వీరారెడ్డి,సుందరి వీర రాఘవయ్య,మద్దెల జ్యోతి, మేకనబోయిన సైదమ్మ,సుందరి రమాదేవి,మూల విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




డ్రైవింగ్ లైసెన్స్.. నిబంధనల్లో కీలక మార్పులు!

75 శాతం మార్కులు వస్తేనే డ్రైవింగ్ లైసెన్స్..

అదిలాబాద్/ఇచ్ఛోడ అక్షిత న్యూస్ : కేంద్ర ప్రభుత్వం డ్రైవింగ్ లైసెన్స్ నిబంధన ల్లో కీలక మార్పులు తీసు కొచ్చింది. డ్రైవింగ్ లైసెన్స్ పొందాలనుకునే వారికి కేంద్రం కొత్త నిబంధనలు అమలు చేసింది. ఇకపై 75 శాతం మార్కులు వస్తేనే డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తా రు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి, వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగా హన పెంచడమే లక్ష్యంగా పలు మార్పులను ప్రతిపా దించింది.

ఆన్‌లైన్ పరీక్షలో పాస్ మార్కులు పెంపు :

డ్రైవింగ్ లైసెన్స్ పొందే ముందు అభ్యర్థులకు నిర్వ హించే ఆన్‌లైన్ అసెస్‌మెం ట్ పరీక్షలో కీలక మార్పులు చేసింది. ప్రస్తుతం ఈ పరీక్ష ల్లో ఉత్తీర్ణత సాధించడానికి 60 శాతం మార్కులు సాధి స్తే సరిపోతుండగా.. ఇకపై ఆ పరిమితిని 75 శాతానికి పెంచింది. పరీక్ష రాసే అభ్య ర్థులు మరింత మెరుగైన అవగాహన కలిగి ఉండాల్సి ఉంటుంది. అంతేకాకుండా, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియ మాలు, బాధ్యతాయుత మైన డ్రైవింగ్‌పై అవగాహన కల్పించే ట్యుటోరియల్ కనీ సం 30 నిమి షాల పాటు నిర్వహించాలని సూచిం చింది. ఈ శిక్షణ పూర్తయిన తర్వాతే అసెస్‌మెంట్ ప్రక్రి య కొనసాగనుంది.



లైసెన్స్ వివరాల మార్పునకు గడువు :

డ్రైవింగ్ లైసెన్స్‌లో పేరు, చిరునామా వంటి వ్యక్తిగత వివరాలను సవరించుకోవ డానికి దరఖాస్తు చేసుకునే వారికి కూడా కొత్త విధానం అందుబాటులోకి రానుంది. ఇలాంటి దరఖాస్తులను సంబంధిత అధికారులు 15 రోజుల్లోగా పరిశీలించి ఆమోదించాలి. లేకుంటే తిరస్కరించాలి. తిరస్కర ణకు నిర్ణయం తీసుకుంటే అందుకు గల కారణాలను దరఖాస్తుదారుడికి తెలియ జేయడం తప్పనిసరి. చిరు నామా మార్పునకు సంబం ధించిన దరఖాస్తుపై 30 రోజుల్లోగా అధికారులు ఎలాంటి నిర్ణయం వెల్లడించ కపోతే, ఆ దరఖాస్తుకు ఆమోదం లభించినట్లుగా పరిగణించాలని ముసాయి దాలో పేర్కొంది. కార్యాల యాల చుట్టూ తిరిగే అవస రం తగ్గడంతో పాటు దరఖా స్తుల పరిష్కారంలో జాప్యం తగ్గే అవకాశం ఉంది.

లైసెన్స్ కార్డుల జారీలోనూ మార్పులు :

కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునే వారితో పాటు ఇప్పటికే లైసెన్స్ కలిగి ఉండి రెన్యువల్ చేసుకునే వారికి కూడా కొత్త విధానం వర్తించే లా ప్రతిపాదనలు రూపొం దించారు. ఇకపై జారీ చేసే కొత్త లైసెన్సులు, రెన్యువల్ కార్డులను లేమినేటెడ్ రూపంలో, పీవీసీ కార్డులుగా అందించాలని ముసాయిదా లో పేర్కొంది. ప్రస్తుతం ప్రతి పాదించిన మార్పులపై సంబంధిత భాగస్వామ్య పక్షాలు, ప్రజల నుంచి 30 రోజుల పాటు అభ్యంత రాలు, సూచనలు స్వీకరిం చనున్నారు. అందిన అభి ప్రాయాలను పరిశీలించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం తుది నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. అప్పటివరకు ఇవి ప్రతిపాదిత నిబంధనలు మాత్రమే. తుది నిర్ణ యం వెలువడిన తర్వాతే కొత్త మార్పులు అమల్లోకి రాను న్నాయి.

ఐఎఫ్ఎంఐఎస్ విధానాల అమలుతో ప్రభుత్వ కార్యాలయాల్లో

డిజిటల్ పరిపాలనకు మరింత ప్రాధాన్యత

ఈ-సాంక్షన్, ఈ-హెచ్ఆర్ఎంఎస్, వర్క్స్ అకౌంట్స్ మేనేజ్‌మెంట్ విధానాలపై అన్ని శాఖల డీడీఓలకు శిక్షణ

పారదర్శకత, జవాబుదారీతనం

వేగవంతమైన సేవలే లక్ష్యం

జిల్లా ట్రెజరీ అధికారి ఎం.ఏ. రషీద్



నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి: ప్రభుత్వ పరిపాలనలో డిజిటల్ విధానాలను విస్తృతంగా అమలు చేయడంతో పాటు ఆర్థిక లావాదేవీలు, ఉద్యోగుల సేవా సంబంధిత వ్యవహారాలు, ప్రభుత్వ పనులకు సంబంధించిన అకౌంట్ల నిర్వహణను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా చేపట్టేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐఎఫ్ఎంఐఎస్ వ్యవస్థపై సంబంధిత అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ట్రెజరీ అధికారి ఎం.ఏ. రషీద్ సూచించారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ఆదేశాల మేరకు ఈ-సాంక్షన్ ఈ-హెచ్ఆర్ఎంఎస్ వర్క్స్ అకౌంట్స్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ విధానాల అమలులో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు కు బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో ఒకరోజు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. జిల్లా ట్రెజరీ అధికారి ఎం.ఏ. రషీద్, పే అండ్ అకౌంట్స్ అధికారి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ట్రెజరీ అధికారి ఎం.ఏ. రషీద్ మాట్లాడుతూ,..... ప్రభుత్వ శాఖల్లో పరిపాలనా ప్రక్రియలను సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేసి, ప్రతి దశలో పారదర్శకతను పెంపొందించడమే ఐఎఫ్ఎంఐఎస్ విధానం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన డిజిటల్ వ్యవస్థలను అధికారులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని, వాటి పనితీరు, కార్యాచరణ విధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

ఈ-సాంక్షన్ విధానం ద్వారా ప్రభుత్వ నిధుల మంజూరు, సంబంధిత అనుమతుల ప్రక్రియలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించేందుకు వీలుంటుందని వివరించారు. ఈ-హెచ్ఆర్ఎంఎస్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన వివరాలు, సేవా రికార్డుల నిర్వహణ వంటి అంశాలను డిజిటల్ విధానంలో చేపట్టవచ్చని ఆయన తెలిపారు. అదేవిధంగా వర్క్స్ అకౌంట్స్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ద్వారా ప్రభుత్వ పనులకు సంబంధించిన ఆర్థిక, అకౌంటింగ్ వ్యవహారాలను నిర్దేశిత విధానాల ప్రకారం నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

శిక్షణలో భాగంగా ఆయా సాఫ్ట్‌వేర్ విధానాల వినియోగం, ఆన్‌లైన్‌లో అనుసరించాల్సిన కార్యాచరణ ప్రక్రియలు, డీడీఓలు నిర్వహించాల్సిన బాధ్యతలు, సంబంధిత వివరాల నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ మార్గదర్శకాల అమలుపై అధికారులకు అవగాహన కల్పించారు.



నూతన విధానాలను అమలు చేసే సమయంలో ఎదురయ్యే సందేహాలు, సాంకేతిక సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై కూడా అధికారులకు శిక్షణ తరగతుల్లో వివరించారు.ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో డీడీఓల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి అధికారి నూతన విధానాలపై అవగాహన పెంపొందించుకొని తమ పరిధిలోని కార్యాలయాల్లో వాటిని సమర్థవంతంగా అమలు చేయాలని ఈ సందర్భంగా సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో ఆచరణలో పెట్టడం ద్వారా ప్రభుత్వ పరిపాలనలో జాప్యాన్ని తగ్గించి, పనితీరును మెరుగుపరచవచ్చని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లా, మండల స్థాయి అధికారులతో పాటు సంబంధిత డీడీఓలందరికీ దశలవారీగా శిక్షణ అందించే కార్యక్రమంలో భాగంగా ఈనెల ఆరో తేదీలోగా ఈ తరగతులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

శిక్షణా కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన డీడీఓ అధికారులు హాజరై సంబంధిత అంశాలపై అవగాహన పొందారు.

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న డిజిటల్ సంస్కరణలను విజయవంతంగా అమలు చేయడంలో ప్రతి శాఖ అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఐఎఫ్ఎంఐఎస్ ద్వారా అందుబాటులోకి వస్తున్న నూతన సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

ఈ శిక్షణ తరగతుల్లో అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు,

మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే మా లక్ష్యం..

టాస్క్ ఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



కల్వకుర్తి అక్షిత ప్రతినిధి: కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక బెంగళూరు స్కిల్ సమ్మిట్--2026లో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి భాగస్వామిగా పాల్గొంది..ఈ జాతీయ స్థాయి సదస్సులో.

టాస్క్ సిఈఓ నితిన్ కుమార్ రెడ్డి తో కలిసి..టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించారు.ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.భవిష్యత్ నైపుణ్యాలే యువతకు బలమైన పునాది.ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత కేవలం విద్యార్హతలకే పరిమితం కాకుండా పరిశ్రమలకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలను కూడా అలవర్చుకోవాలి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ), ఇండస్ట్రీ 4.0, డీప్ టెక్నాలజీ, గ్రీన్ జాబ్స్ వంటి భవిష్యత్ రంగాల్లో శిక్షణ పొందడం ద్వారా యువతకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయి..

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ..

విద్యాసంస్థలు,పరిశ్రమలు,ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం ఎంతో అవసరం. కంపెనీలకు ఎలాంటి నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులు అవసరమో గుర్తించి, అందుకు అనుగుణంగా యువతకు శిక్షణ అందించాలి..శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్లేస్‌మెంట్ ఆధారిత కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలి.తెలంగాణ యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే మా సంకల్పం..

టాస్క్ ద్వారా రాష్ట్రంలోని యువతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల యువతకు కూడా ఆధునిక శిక్షణ,మెరుగైన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలన్నదే మా లక్ష్యం.నైపుణ్యవంతమైన తెలంగాణ.. ఉపాధి అవకాశాలతో కూడిన యువతరం..

తెలంగాణ యువత దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ పోటీపడేలా తీర్చిదిద్దేందుకు టాస్క్ తన కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ సహకారం,పరిశ్రమల భాగస్వామ్యం, విద్యాసంస్థల సమన్వయంతో యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పించేందుకు కృషి చేస్తామని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో.. టాస్క్సీఈఓ నితిన్ కుమార్ రెడ్డి టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డితో పాటు టాస్క్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు

పాస్‌బుక్ కోసం రోజుల తరబడి బ్యాంకు చుట్టూ తిరగాల్సిందేనా?

తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ తీరుపై డిగ్రీ విద్యార్థిని ఆవేదన

ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ మేనేజర్ నిర్లక్ష్యపు సమాధానం



మంథని/మహాదేవపూర్, అక్షిత ప్రతినిధి: బ్యాంకు సేవల్లో జాప్యం, అధికారుల బాధ్యతా రహిత్య ప్రవర్తన సామాన్య ప్రజలను ఏ విధంగా ఇబ్బందులకు గురిచేస్తోందో తెలిపే ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వెలుగుచూసింది. మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతా తెరిచిన ఓ డిగ్రీ విద్యార్థిని, తన పాస్‌బుక్ కోసం రోజుల తరబడి బ్యాంకు చుట్టూ తిరగాల్సి వస్తోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితురాలి కథనం ప్రకారం.. అత్యవసర నిమిత్తం పాస్‌బుక్ అవసరమై ఆమె మంగళవారం బ్యాంకుకు వెళ్లారు. అక్కడ సిబ్బంది రెండు గంటల్లో పాస్‌బుక్ ఇస్తామని చెప్పడంతో, ఆమె నమ్మి సాయంత్రం ఐదు గంటల వరకు బ్యాంకులోనే వేచి ఉన్నారు. అయినప్పటికీ పాస్‌బుక్ ఇవ్వకపోగా, చివరకు మరుసటి రోజు రావాలని మేనేజర్ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీనిపై అక్కడున్న తోటి ఖాతాదారులు, బాధితురాలు మేనేజర్‌ను ప్రశ్నించగా.. తీవ్ర అసహనానికి లోనైన ఆయన “మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి” అంటూ బాధ్యతారహిత్యంగా సమాధానం ఇచ్చినట్లు విద్యార్థిని ఆరోపించారు. బ్యాంకు సేవల కోసం వచ్చే ఖాతాదారులను గంటల తరబడి వేచి ఉండేలా చేయడం, కనీస సేవ అయిన పాస్‌బుక్ జారీ చేయడంలో ఇంత జాప్యం చేయడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, సదరు బ్యాంకు మేనేజర్ తీరుపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, వినియోగదారులకు సత్వర సేవలు అందేలా చూడాలని బాధితురాలితో పాటు స్థానిక ప్రజలు కోరుతున్నారు

కాటమయ్య ఆలయ నిర్మాణానికి అంకురార్పణ

నిదానపల్లిలో వైభవంగా భూమిపూజ..

పెద్ద సంఖ్యలో పాల్గొన్న గౌడ కులస్తులు



రామన్నపేట, అక్షిత ప్రతినిధి: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామంలో కాటమయ్య స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. గౌడ సంఘం చైర్మన్ కొండ మల్లేశం గౌడ్, ముస్తాది దారుడు వీరమల్ల భిక్షం గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా సాగింది. సిద్ధాంతి బేతాజీ సత్యనారాయణ శాస్త్రి, దీక్షితులు శశిధర్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన గౌడ కులస్తులు, కుల పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తితో పూజల్లో పాల్గొన్నారు.కాటమయ్య స్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ నిర్మాణం చేపట్టడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతికి నిరసనగా సత్తుపల్లిలో బస్సులు బంద్



సత్తుపల్లి, అక్షిత న్యూస్: చిల్లర డబ్బుల విషయమై ఓ ప్రయాణికురాలు బస్సులో నుంచి తోసేసిన ఘటనలో తీవ్రంగా గాయపడి పది రోజులపాటు మృత్యువుతో పోరాడిన ఆర్టీసీ మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక(24) మంగళవారం రాత్రి మృతి చెందింది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని ఆదర్శ్ నగర్ కు చెందిన గుండ్ల ప్రవళిక (24) కు ఆర్టీసీ డిపోలో మెకానిక్ గా పనిచేసిన తన తండ్రి నాగరాజు చనిపోవడంతో వారసత్వంగా నాగరాజు కుమార్తె అయిన ప్రవళికకు 10 నెలల క్రితం కండక్టర్ ఉద్యోగం వచ్చింది. మణుగూరు డిపోలో పనిచేస్తుంది.మరో రెండు నెలల్లో ప్రవళికకు వివాహం చేయడానికి కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. గత నెల 25న మణుగూరు నుండి భద్రాచలం వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులో విధులు నిర్వహిస్తున్న క్రమంలో అశ్వాపురం మండలం పిచికల తండాకు చెందిన ప్రయాణికురాలు మౌనిక కు కండక్టర్ ప్రవళిక కు మధ్య టికెట్ చిల్లర విషయంలో గొడవ జరిగింది. మౌనిక తన కుమారుడి టికెట్ కొరకు కండక్టర్ కు 100 రూపాయలు ఇవ్వగా చిల్లర కోసం కండక్టర్ తో మౌనిక దుర్భాషలాడి గొడవ పడింది ఈ క్రమంలోనే మిట్టగూడెం సెంటర్ వద్దకు రాగానే ఆ ప్రయాణికురాలు ప్రవళికను ఆగ్రహంతో బస్సులో నుండి తోసేసింది.బస్సులో నుంచి ప్రవళిక కింద పడిపోగానే బస్సు వెనుక చక్రాలు ఆమె రెండు కాళ్లపై నుండి వెళ్లడంతో కాళ్లు నుజ్జు నుజ్జు అవ్వగా అప్రమత్తమైన తోటి ప్రయాణికులు 108 కి ఫోన్ చేసి వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్రవళికను పెద్ద ఆసుపత్రికి తరలించగా మంగళవారం రాత్రి మృతి చెందింది. దీనికి నిరసనగా బుధవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపో ముందు ఆర్టీసీ కార్మికులు ప్రవళిక కు న్యాయం జరగాలని ఆర్టీసీ కార్మికులపై దాడులను అరికట్టాలని బస్సులు బంద్ చేసి కుండపోత వర్షం లో సైతం తమ నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డిపో ఉద్యోగులు,కార్మికులు పాల్గొన్నారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎం ఈ ఎఫ్) కృతజ్ఞతలు

ఎం ఈ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరపాగ ప్రభాకర్



నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి: ఎస్సీ వర్గీకరణను అన్ని శాఖల ఉద్యోగుల ప్రమోషన్లలో పగడ్బందీగా అమలు చేసేందుకు చట్టబద్ధమైన చర్యలు తీసుకొని (మెమో) జారీ చేయడంలో విశేష చొరవ చూపిన రాష్ట్ర ఎస్సీ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ ని కరీంనగర్ జిల్లా, ధర్మపురి లో కలసి మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఎం ఈ ఎఫ్ నాయకుల బృందము మర్యాదపూర్వకంగా కనబడడం జరిగింది.

ఎం ఈ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరపాగ ప్రభాకర్ మాట్లాడుతూ, మెమో జారీ చేసినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తూ, దానికి సంబంధించినటువంటి జీవో ను కూడా త్వరగా విడుదల చేయాలని మంత్రిగారిని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ,రాష్ట్ర ఎం ఈ ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

కుటుంబ సమేతంగా కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సేవలో పాల్గొన్న తాండూరు ఎమ్మెల్యే



తాండూరు అక్షిత ప్రతినిధి: కలియుగ దైవం, ఆపద మొక్కులవాడు, భక్తుల కొంగు బంగారమైన తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. తిరుమల పుణ్య క్షేత్రానికి చేరుకున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి సన్నిధిలో పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు.

శ్రీవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకుని, భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, తాండూరు నియోజకవర్గం సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని, ఆకాంక్షించారు.

కలియుగ ప్రత్యక్ష దైవంగా పూజలందుకుంటున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం ఎంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందని, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకోవడం విశేషమైన అనుభూతిని అందించిందని, తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి కృపాకటాక్షాలు తాండూరు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించి నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని, ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలు నిండాలని, స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

శ్రీవారి ఆశీస్సులతో తాండూరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కలగాలని, ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసే శక్తిని స్వామివారు ప్రసాదించాలని, ప్రార్థించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని, ఆధ్యాత్మిక తృప్తిని కలిగించిందని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గోవింద నామస్మరణలతో మారుమోగే తిరుమల పుణ్య క్షేత్రంలో స్వామివారి దర్శనం భక్తిభావాన్ని మరింత పెంపొందించిందని, తెలిపారు.

మహాదేవపూర్‌లో ఇసుక లారీ బీభత్సం

ప్రభుత్వంపై బీజేపీ నేత చల్లా నారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం



మంథని/మహాదేవపూర్, అక్షిత ప్రతినిధి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా వచ్చిన ఒక ఇసుక లారీ ఢీకొట్టడంతో పోత స్వామి అనే స్థానిక వ్యక్తి అక్కడికక్కడే అతి దారుణంగా మరణించాడు. మంథని నియోజకవర్గంలో అడ్డూఅదుపూ లేకుండా సాగుతున్న ఇసుక లారీల ఇష్టారాజ్యం, అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి శ్రీధర్ బాబు పాలనపై ధ్వజం:

ఈ ఘటనపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా నారాయణ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మంథని నియోజకవర్గంలో ఇసుక మాఫియా ఆగేదెప్పుడు? ప్రజల ప్రాణాలకు రక్షణ ఏది శ్రీధర్ బాబు? అని ఆయన ప్రశ్నించారు. అక్రమ ఇసుక రవాణా, భారీ వాహనాల వేగం మధ్య సామాన్య ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీశారు. అధికారులకు, పాలకులకు ఇసుక సంపదపై ఉన్న శ్రద్ధ, ప్రజల ప్రాణాలపై లేకపోవడం శోచనీయమన్నారు.

బాధిత కుటుంబానికి అండగా.. డిమాండ్లు ఇవే:

ప్రమాదం జరిగిన విషయం తెలియగానే చల్లా నారాయణ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, దహన సంస్కారాల నిమిత్తం తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను ఉంచారు:

బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ. 25 లక్షల నష్టపరిహారం చెల్లించాలి.

మృతుడి కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలి.

మహాదేవపూర్ మండల కేంద్రంతో పాటు నియోజకవర్గంలో ఇసుక లారీల రవాణాపై కఠిన నియంత్రణ విధించాలి.

ఈ ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే చూస్తూ ఊరుకునేది లేదని, ప్రజల భద్రత కోసం, బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాడతామని చల్లా నారాయణ రెడ్డి హెచ్చరించారు.

పంట కుంటలతో భూగర్భ జలాల పెంపు

నీటి వనరులను పాదుపుగా వినియోగించుకోవాలి: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, నవంబర్ 4: వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు పంటలకు సాగునీటి భద్రత కల్పించేందుకు రైతులు పంట కుంటలను విస్తృతంగా నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. లింగాల ఘనపురం మండలం సిరిపురం గ్రామంలో రైతు బసవగాని మహేష్ వ్యవసాయ క్షేత్రంలో నిర్మించిన పంట కుంటను బుధవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. పంట కుంట నిర్మాణం, వర్షపు నీటి నిల్వకు చేసిన ఏర్పాట్లు, కుంటను వ్యవసాయ అవసరాలకు వినియోగిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో నీటి వనరుల సంరక్షణకు పంట కుంటలు ఎంతో దోహదపడతాయని అన్నారు. వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాల మట్టాలు పెరగడంతో పాటు, అవసరమైన సమయంలో పంటలకు సాగునీరు అందించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వర్షపాతం హెచ్చుతగ్గులను దృష్టిలో ఉంచుకొని రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయంలో నీటి వృథాను అరికట్టి, తక్కువ నీటితో అధిక ప్రయోజనం పొందే సాగు పద్ధతులను అవలంబించాలని కోరారు. ప్రతి రైతు తన వ్యవసాయ క్షేత్రంలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా భవిష్యత్తులో సాగునీటి కొరతను అధిగమించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. పంట కుంటల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకొని అవసరమైన సమయంలో వినియోగించుకోవడం ద్వారా పంటలకు నీటి భద్రత కల్పించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు పంట కుంటలు, ఇతర నీటి సంరక్షణ నిర్మాణాల ప్రాధాన్యతను గుర్తించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ, ఏడీఏ వసంత సుగుణ, డీపీఎంలు జ్యోతి, నళిని, మారి సంస్థ ప్రతినిధులు మారపాక వెంకట్ స్వామి, చాగంటి నరేష్, గాండ్ల రాజు, వంశీ, రాజేందర్, రీఛా, కృషి సఖీలు, రైతులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.